క్లుప్తంగా

సీఐ వెంకటేశ్వర్లుకు సన్మానం



సీఐ వెంకటేశ్వర్లును సన్మానించిన సర్పంచ్ తులసీరాంనాయక్

కడ్తాల్: ఆమనగల్లు సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును, మైసిగండి సర్పంచ్ తులసీరాంనాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను, పత్యానాయక్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ అన్నారు. మండలంలోని వెల్జాల్ గ్రామానికి చెందిన సయ్యద్ హాబీబ్‌కు రూ. 125000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శ్రీనివాసుయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ రహ్మాన్, శ్రీరామ్, యాదయ్య, మోహన్‌లాల్, రాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణానికి ఈజీఎస్ క్రింద రూ.20 లక్షలు కేటాయించడాన్ని హర్షిస్తూ మాడ్గుల మండలం అంతంపేట గ్రామంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మండలం బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, నాయకులు శ్రీనివాస్, తానేశ్‌యాదవ్, మధుయాదవ్, మహేశ్, అనిల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రైతు పక్షపాతి

తలకొండపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసు యాదవ్ అన్నారు. రైతురుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా సీఎం కేసీఆర్ నిలిచిపోయారని కొనియాడారు. గురువారం మండల కేంద్రంతో పాటు, వెల్జాల్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మహ్మాన్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, సుల్తాన్, శ్రీశైలం, భాస్కర్, రాజు, బుచ్చయ్య, మోహన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను కాపాడుకోండి

రాయపోల్ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి



గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: గాలికుంటు వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవాలని రాయపోల్ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి రైతులకు సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. 180 గేదెలకు, 70 ఆవులకు నివారణటీకాలు వేశారు. ఎంపీటీసీలు శ్రీశైలం, జ్యోతి, ఉప సర్పంచ్ బాల్‌రాజ్, ఎల్మినేడు ప శువైద్యాధికారి డాక్టర్ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

8న చేనేత కార్మిక సంఘం మహాసభ

తుర్కయంజాల్: తెలంగాణ చేనేత కార్మిక సంఘం తూర్పు రంగారెడ్డి జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 8వ తేదిన తుర్కయంజాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరయ్య తెలిపారు. గురువారం కమ్మగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు జిల్లాలోని చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు. కమ్మగూ డ కౌన్సిలర్, పీసీసీ సభ్యులు సునీల్, నాయ కులు ఎం.నరహరి, రాంచందర్, రాకేష్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల నిరసన

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంచాల మండల కార్యాలయం ఎదుట గురువారం బతుకమ్మ ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఖాజా పాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్ర భుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల గోడును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

‘నులి’మేద్దాం రండి!

- నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు
- 1–19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగులను నివారించేందుకు నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ప్రతి ఏడాది నులిపురుగుల చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ ఆకుల యాదగిరి ప్రభుత్వ పాఠశాలలో గురువారం పంపిణీ చేశారు. అలాగే ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పరమేష్ , ఎల్మినేడు గ్రామంలో ఉపాధ్యాయులు పిల్లలకు నులిపురుగుల నివారణమాత్రలు అందజేశారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: నులి పురుగులను నివారించాలని ఎంపీపీ నిర్మల పిలుపునిచ్చారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని చంద్రధనలోని ప్రాథమిక పాఠశాలలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ 1–19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయాలన్నారు. నులిపురుగుల వల్ల పిల్లలు తరచుగా అనారోగ్యానికి గురవుతారని, అలాగే చదువు పట్ల ఆసక్తి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు కృష్ణవేణి, డాక్టర్ సైదమ్మ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



కడ్తాల్: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ప్రతి ఒక్కరూ సహకరించాలి

కడ్తాల్: నులిపురుగుల నివారణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాని ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నులిపురుగు నివారణ మాత్రలు వేయడంతో పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చని, దీంతో పిలల్లో చురుకుదనం, జ్ఞాపక శక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీహెచ్ఈవో సుధీర్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

నోములలో..

మంచాల: మంచాల మండల పరిధిలోని నోముల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎం హెచ్ఓ ధరణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ నులుపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు

విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు

యాచారం: విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ సుకన్య సూచించారు. మండల కేంద్రంలోని యాచారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నులిపురుగుల మందులను వేశారు. ఆమె మాట్లాడుతూ నెలలో ఒక రోజు వైద్య సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యా ర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని కొహెడ, బ్రాహ్మణపల్లిలో విద్యుత్ తీగల వద్ద అంతరాయం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేస్తున్నామని, అందువల్ల శుక్రవారం కరెంటు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సప్తగిరి ఫీడర్ పరిధిలోని కొహెడ, పలు కాలనీల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 6 గంటల వరకు బాలాజీ నగర్ ఫీడర్ పరిధిలోని బ్రాహ్మణపల్లితో పాటు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ఆయన పేర్కొన్నారు.

యాచారంలో..

యాచారం: విద్యుత్ లైనులో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. మాల్ 33 కేవీ పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, నల్లవెల్లితండా, భానుతండా, నున్సవాత్‌తండా, తమ్మలోనిగూడ, చింతపట్ల, కిషన్‌పల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: తారమతిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవీ ఫీడర్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని.. అందువల్ల శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సద్దుపల్లి గ్రామంతో పాటు వ్యవసాయ, పరిశ్రమల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ విద్యారాణి తెలిపారు.

యాచారం తహసీల్దార్‌గా శ్రీకాంత్‌రెడ్డి

యాచారం: మండల తహసీల్దార్‌గా శ్రీకాంత్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుచరిత మేడ్చేల్ జిల్లాకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నారు.

కడ్తాల్ తహసీల్దార్‌గా అన్వర్

కడ్తాల్: కడ్తాల్ మండల తహసీల్దార్‌గా అన్వర్ నియమిస్తున్నట్లు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కడ్తాల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ డిప్యూటీ కలెక్టర్‌గా, జూన్ నెలలో బదిలీపై వెళ్లారు. అప్పటి నుండి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ వినోద్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్‌ల బదిలీలో భాగంగా సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై కడ్తాల్ తహసీల్దార్‌గా అన్వర్ రానున్నారు.

ఆమనగల్లు తహసీల్దార్‌గా గిరిజ

ఆమనగల్లు: ఆమనగల్లు మండల తహసీల్దార్‌గా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సీ సెక్షన్‌లో పనిచేస్తున్న గిరిజను నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతిని హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే మాడ్గుల మండల తహసీల్దార్‌గా సంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన కే శివకుమార్‌ను నియమించారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు ఆపాలి



ఆమనగల్లులో క్రైస్తవుల ర్యాలీ

ఆమనగల్లు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఆపాలని కల్వకుర్తి, ఆమనగల్లు పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ క్రైస్తవసంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే బీజేపీ ప్రభుత్వం క్రైస్తవులపై దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. తక్షణమే మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యానంద్, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శి ఆనంద్, ప్రధాన కార్యదర్శి సఫ్యాబేగం, కల్వకుర్తి నియోజక వర్గ బీఎస్‌పీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ఆందోళన

హయత్‌నగర్: మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ దళిత బహుజన సంఘాలు, గిరిజన సంఘాల నాయకులు గురువారం హయత్‌నగర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం నాయకుడు పారందస్వామి మాట్లాడుతూ గిరిజనులపై దాడులు చేస్తూ చర్చీలను కూల్చి వేస్తున్నా అక్కడి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దాడుల్లో పాల్గొన్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, కనకయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి

తుర్కయంజాల్: అర్హులైన పేదలందరికీ వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ కోరారు. గురువారం తుర్కయంజాల్‌లో ఆయన మాట్లాడుతూ ఇంజాపూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహా గౌడ్, శ్రావణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన పరుశురాములు (58) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఉప సర్పంచ్ సుధాకర్, స్థానిక నాయకుడు రాజేందర్‌రెడ్డిలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ. 3000 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా గట్టుఇప్పలపల్లికి చెందిన జంగమ్మ (59) మృతిచెందింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్యలు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. రేణురెడ్డి రూ. 2500, చంద్రశేఖర్ రెడ్డి రూ. 3000, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్యలు రూ. 2000 ఆర్థిక సహాయం అందజేశారు.

తాగునీటి సమస్యకు స్వస్తి

మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు



మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆంజనేయులు, అధికారులు

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంతో గ్రామాలకు, పల్లెలకు, తండాలకు త్రాగునీటి సమస్యలు తీరాయని, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను, స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డిలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే విధంగా మండల కేంద్రంలోని 2, 3వ వార్డులను అనుసంధానం చేసే విధంగా మరో లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు ఏర్పాటుకు నివేదికలు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, వార్డు సభ్యులు నరేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ తదితరులున్నారు.

50 మందిపై ఈ పెట్టీ కేసులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 50 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. నిందితులను గురువారం హయత్‌నగర్ కోర్టులో హాజరు పర్చారు. దీంతో మెజిస్ట్రేట్ వారికి జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ తెలిపారు. రాత్రి సమయాల్లో సమయానికి మించి హోటళ్లు, దాబాలు, దుకాణాలు కొనసాగించిన వారితో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రాంగ్‌రూట్లలో వాహనాలు నడిపిన వారిని, నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఒక వ్యక్తిపై రెండుకు మించి కేసులు నమోదు అయితే.. వారిని జైలుకు కూడా పంపించనున్నట్లు హెచ్చరించారు. పోలీసులు సూచించిన నిబంధనల మేరకు నడుచుకోవాలని మన్మోహన్ సూచించారు.

పింఛన్లు మంజూరు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

మంచాల: పెండింగ్‌లో ఉన్న పింఛన్లు ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నేనావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్‌కు పింఛన్లు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మంజూరు విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మండలంలో ఎంతో మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అర్హులైన వారికి సకాలంలో సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నందకుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ ఉపాధ్యాయులు శారీరక శ్రమతో పాటు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. స్వేచ్ఛగా పని చేసే వాతవరణం కల్పించాలన్నారు.

అమ్మ పాలే బిడ్డకు అమృతం

ఇబ్రహీంపట్నం రూరల్: అమ్మపాలు బిడ్డకు అమృతం కంటే ఎక్కువ అని ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ లావణ్య పాండురంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పుట్టిన బిడ్డ గంటలోపే పాలు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు బేబీ, సూజాతలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత అన్నారు. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పెద్దూర్‌తాండ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల ఆవశ్యకత– అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, కార్యదర్శి వాజీద్, ఎంపీ టీసీలు రఘునాయక్, రమేశ్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ర్యాలీ

దేవుని పడకల్ నుంచి ముగ్గురు ఎస్‌ఐలు



ఎస్‌ఐలను సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ గ్రామానికి చెందిన ముగ్గురు ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. ఎస్‌ఐలుగా ఎంపికైన మానస, శ్రీధర్, శివలను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ రవి, గౌడసంఘం మండల ఉపాధ్యక్షుడు స్వామి గౌడ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ ముగ్గురు ఇటీవల నిర్వహించిన పోలీస్ ఈవెంట్స్, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐలు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవచేసేందుకు అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రణాళికతో చదివి, శిక్షణ తీసుకుంటే ఎవరైనా ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావచ్చన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, మల్లేశ్, వెంకటయ్య, జంగయ్య, లింగయ్య, స్వామిగౌడ్, శంకర్, రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం

కడ్తాల్: కడ్తాల్ గ్రామర్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని, పడకల్ గ్రామానికి చెందిన మానస ఎస్‌ఐగా ఎంపికైంది. ఇక్కడే చదువుకున్న గానుగుమార్లతాండకు చెందిన రాకేశ్ నీట్‌లో ర్యాంకు సాధించారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానస, రాకేశ్‌తో పాటు వారి తల్లి తండ్రులను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పూర్వ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు యాదయ్యగౌడ్, సుధాకర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, కేశవులుగౌడ్, విజయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత



మంగళపల్లిలో ప్రహరి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మండల వైస్ ఎంపీపీ అనంతరెడ్డి తెలిపారు. మంగళపల్లి గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలుకు రూ.2.80 లక్షలతో నిర్మించే ప్రహరీగోడ నిర్మాణ పనులకు గురువారం సర్పంచ్ నర్సింహారెడ్డితో కలిసి అనంతరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, ప్రకృతివనాలు తదితర పనులు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్, స్థానిక నాయకులు మురళి, వెంకటేశ్, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని ప్రకటించేవరకు దీక్షలు



గట్టుఇప్పలపల్లిలో నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, తదితరులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారానికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, అయినా మండలాన్ని ఎందుకు ఏర్పాటు చేయ లేదని ప్రశ్నించారు. మండలం ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రులు, ఆర్డీఓ కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారని తెలిపారు. నాయకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడం వలన గట్టుఇప్పలపల్లి మండల కేంద్రంగా ఏర్పాటు కావడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజు, జంగయ్య, కృష్ణ, దైవానందం, నరసింహ, శివయ్య, అంజయ్య, లక్ష్మీపతి, మల్లారెడ్డి, సుందరయ్య, చంద్రయ్య, రేణురెడ్డి, వెంకటయ్య, డేవిడ్, రాజెందర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఘన సన్మానం



తలకొండపల్లిలో తహసీల్దార్లను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్లను ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న కృష్ణ హైదరాబాద్‌లోని సరూర్‌గర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ రెవెన్యూ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న అయ్యప్ప తలకొండపల్లి మండల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం విధులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి వీడ్కోల్, స్వాగత సమావేశ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లింపుల సాక్షి శివ, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, యాదయ్య, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటర్ కళాశాల ప్రారంభం

జిల్లా విద్యాశాఖాధికారి వెంక్యానాయక్



కళాశాలను పరిశీలిస్తున్న అధికారులు, ఎంపీపీ తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలను త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంక్యానాయక్ అన్నారు. తరగతి గదుల పరిశీలన నిమిత్తం గురువారం తలకొండపల్లి మండల కేంద్రానికి వెంక్యానాయక్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రూపుల్లో కలిసి మొత్తం 15 మంది విద్యార్థులు ఉన్నట్‌లెత్తే కళాశాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, హెచ్ఎంలు భగ్‌వాన్‌రెడ్డి, శంకర్‌లతో కలిసి ఆయన కళాశాలకు ఉండాల్సిన సదుపాయాలు, వనరులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీడీ రఘుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.